

# ఒకే కొమ్మ-రెండు పువ్వులు

పి.యస్. నారాయణ

"రాత్రికి ఎలాగైనా సరే నువ్వు బయలుదేరి తెల్లవారేటప్పటికి గుంటూరు లో వుండాలి....

మాణిక్యం కొడుకు ఇంటి మీదకు వచ్చాడు. వాళ్ల పేట వాళ్ళని నలుగురిని వెంటతీసుకొని !" విసుగ్గా విసురుగా చెప్పాడు భానుమూర్తి గుంటూరు నుంచి ఫోన్ చేసి అన్నయ్య మాధవరావుకు - రాత్రి ఎనిమిదిన్నర గంటలప్పుడు.

"దేనికట ?" మాధవరావు అడిగాడు.

"ముసలాయన చస్తూ మిగిల్చి మనకిచ్చిన బోడి రెండకరాల మామిడి లెక్కలో బాగం కావాలిట !"

"కోర్టుకు వెళ్ళమను వెధవను !"

"నీకేం హైదరాబాద్‌లో కూర్చొని ఎన్ని కబుర్లయినా చెబుతావ్... పొద్దున లేచినప్పటినుండీ ఎదురుగ్గా కనబడుతుండేది నేను !" కోపంగా అన్నాడు.

"ఇప్పటికి ఇప్పుడు ఫోన్ చేసి రమ్మనమంటే ఎలా వస్తానురా... బస్సుకు టికెట్లు దొరకాలా ! ... చేసేదేదో సాయంత్రం చేయకపోయావా మరి !" మాధవరావుకు కోపమెచ్చింది.

"వాడు కొంపమీదకు తగలబడింది ఇప్పుడే గదా!"

- కానీ మాధవరావుకు నమ్మకం లేదు తమ్ముడి మాటలమీద - ఎనిమిన్నర నుంచి ఫోను చార్జీలు తక్కువగదా అని ఇప్పుడు చేసి వుంటాడు - కక్కుర్తి వెధవ !

"మాణిక్యం ఏమంటున్నది ?"

"అది ఏమంటున్నది... చేసిన నిర్వాక మేదో చేసి ముసలాడికి మందు పెట్టి మనకు గ్గాకుండా చేసింది గదా... ప్రస్తుతానికి మంచంలో పడి మూలుగుతున్నది... నా ఆదుర్దా గూడా అదే... అది పుటుక్కుమనేలోగానే ఏదో విధంగా సెటిల్ చేసి శాశ్వతంగా వాడి పీడా వదిలించుకోవాలని ! "

"పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే కాళ్ళూ చేతులూ విరగ్గొట్టిస్తానని చెప్పు" అరుస్తున్నట్లుగా అన్నాడు మాధవరావు.

- తన తండ్రి బ్రతికి వున్నంత కాలం - చేరదీసిన ఆడది మాణిక్యం !


తమతో పాటు భాగం కావాలంటున్న ఆ భ్రష్టుడు - తన తండ్రికి పుట్టిన అమె కొడుకు !

★ ★ ★

బ్రీఫ్ కేసులో ఓ జత గుడ్డలేసుకొని రాజ్యానికి చెప్పి ఇంట్లో నుంచి బయటపడ్డాడు హడావుడిగా మాధవరావు. అప్పటికే తొమ్మిది దాటింది. అదృష్టంకొద్దీ గుంటూరు బస్సులోనే సీటు దొరకటంతో ఎక్కి కూర్చున్నాడు తరువాత అరగంటలోనే.

తమ్ముడు ఇంత హడావుడిగా రమ్మనమనటం మొదటి చికాకయితే - అనుకోని ఈ ఖర్చు మరో చికాకు. ఆ పైన నిముష నిముషానికి రాక్షసిలాంటి మాణిక్యం కళ్ళముందు కనబడుతున్నది.

సృష్టి విచిత్రం అంటే ఇదే అనిపిస్తుంది. తన తండ్రి ఎర్రగా, పొడుగ్గా, బలిష్టంగా, అందంగా వుండేవాడు. అదెక్కడ ఈయనకు దొరికిందోగాని- నల్లగా, పొట్టిగా, పెద్ద కొప్పుతో పాత రూపాయంత బొట్టు పెట్టుకొని భూతంలా వుంటుంది - దాన్ని చూస్తే ప్రేమకూ రూపానికీ ఎలాంటి అనుబంధమూ లేదు అనిపిస్తుంది!




నాలుగు గొడ్లు పెట్టుకొని పాలమ్ముతూ - ఆ వీధంతటినీ ఓ ఊపు ఊపే ఆడది. ఈయన గారి ఇలాకాలోకి వచ్చింతరువాత వాడు పుట్టాడు - ఒక్కసారి తన తండ్రిని చూసిన వాళ్ళు ఆ పిల్లవాడు ఎవరి కొడుకో ఇట్టే చెప్పేయగలరు !

తన తల్లి ఏడ్చి మొత్తుకున్నా తన తండ్రి దాని దగ్గరకు వెళ్ళటం మానలేదు. ఈమె గోల ఎక్కువయిన కొద్దీ ఆయన ఇంటికి రావటం గూడా తగ్గించే వాడు - తమ్ముడు అన్నట్లుగా అది ఏ మందో మాకు పెట్టినట్లు అనిపించింది తన వాళ్ళందరికీ.

చిన్నగా తమ ఆస్థి కరగటం ప్రారంభించింది. దాని పంచన జేరిన తరువాత ఇంట్లో తిండికి తమకు బొటాబొటీగా ఇస్తుండేవాడు డబ్బు తండ్రి. ఎక్కువ రాత్రులు అక్కడే గడుపుతుండేవాడు.

- తన తల్లి చనిపోయేముందు గాని మరో రహస్యం బయట పడలేదు - అంతకుముందు తన తల్లికుండే సొమ్మంతా దాని కొంపకు ఒక్కొక్కటీ తరలివెళ్ళిందని !

చికాగ్గా కళ్ళుమూసుకున్నాడు మాధవరావు.

తెలతెలవారుతుండగా ఇంట్లో కాలు పెట్టాడు. అప్పటికే భానుమూర్తి లేచి అన్నయ్య ఎప్పుడు వస్తాడా అన్నట్లుగా వాకిట్లోకి, లోపలకు కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు.

అన్నయ్యను చూడగానే అతడి మొఖం ఆనందంతో విశాలమయింది. పెద్దవాడు వచ్చాడు గనుక ఆ భారమంతా ఆయన నెత్తిన రుద్దేస్తే తన బాధ్యత తీరిపోతుంది అన్నట్లుగా వున్నాడు.

మాధవరావు మొఖం కడుక్కొని కాఫీ త్రాగుతూ అడిగాడు: "మరి మన ఊళ్ళో ఆయన వదిలేసిన చారిత్రాత్మక కట్టడం - రెండు నిట్టాడుల మట్టి కొంపలో భాగం అఖరలేదటనా ?"

"సత్తు రూపాయి ఎవరికి కావలన్నయ్యా ! పైసా ఆదాయం లేకపోగా - పడిపోతున్న గోడలను బాగు చేయించి వెల్లవేయించాలన్నా వేలు ఖర్చు అవుతుంది -అందుకే ఉదారంగా దాన్ని మీరే ఉంచుకోండి- నాకు తోటలో భాగం చాలు అన్నాడు !"

"లాయర్ని ఎవరినైనా అడిగావా ?"

"ఏదీ... ఇప్పుడేగా నువ్వొచ్చింది... ఆ విషయాలు ఎలా డీల్ చేయాలో నాకు తెలియదు... పెద్దవాడివి నువ్వు మాట్లాడు !"

తమ్ముడివంక చికాగ్గా చూసాడు మాధవరావు. వెధవకు తెలియకగాదు... జేబులో నుంచి డబ్బులు తీసి ఖర్చు పెట్టాలని ఏడుపు... రేపు కాయ అమ్మిన పుడు తగ్గించుకోవచ్చుగదా !

భానుమూర్తి భార్య కల్పించుకుంటూ అన్నది. "అసలు చక్రం తిప్పిన దాని దగ్గరకే వెళ్ళి ఏమిటీ వెధవగోల అని అడిగితే !"

మాధవరావుకు ఆమె సలహాలో పాయింటు వున్నదనిపించింది.

-ఇంతవరకు తమ కుటుంబాన్ని నాశనం చేసింది చాలక ఆయన చచ్చింతరువాత గూడా మమ్మల్నెందుకు పట్టిపీడిస్తావు అని అంటే- కొడుకును అదుపులో పెట్టుకుంటుందేమో ! అనుకున్నాడు.

భానుమూర్తి భార్య మీద గయ్‌న లేచాడు. "అతనప్పుడు దాని వత్తాసు లేకుండా వీడిలా పేట్రేగి పోతాడంటే నేను నమ్మను !"

మాధవరావు చిన్నగా నవ్వాడు. "దాన్ని కదిలించ టంలో మనకేమైనా నష్టమా ?"

"అదే బావగారూ ! నేననేదిగూడా - కాదు - అన్నదనుకోండి మనకు పోయేదేం లేదు... కాస్త మంచి మనస్సుతో ఆలోచించి కొడుకును పిలిచి ఇది తప్పురా అన్నదనుకోండి - మనకు మంచిదేగా ! " బావగారు తన మాట విన్నందుకు హుషారు వచ్చింది ఆమెకు.

"అది చచ్చిం తరువాత మళ్ళీ తయారవ్వడనే నమ్మకమేమిటి ?"

"ఆమె నిజంగా కొడుక్కు బుద్ధి చెబుతే - మనకు కావాల్సినట్లుగా కాగితాల మీద రాయిం చేసుకోవటమే !"

మాధవరావు స్నానం చేసి తయారయి భాను మూర్తితో, "పద !" అన్నాడు.

భానుమూర్తి లేచాడు. "రామారావుగారి దగ్గరకు వెళ్దాం. మనకు కాస్త తెలిసినలాయరు ఆయనే గదా !"

"ముందు మాణిక్యంతో మాట్లాడదాం... అది ఏమంటుందో గూడా విని రామారావుగారి దగ్గరకు వెళ్దాం !" అన్నాడు దృఢంగా మాధవరావు.

భానుమూర్తి అయిష్టం గానే తలూపాడు - ఆ సలహా యిచ్చిన భార్య మీద, దాన్ని అమలు పరుద్దా మనుకుంటున్న అన్నయ్య మీద గొంతు వరకూ కోపమెచ్చింది.

★ ★ ★

భానుమూర్తి, మాధవరావు ఆ వీధి మొదట్లో రిక్షాదిగారు.

ఆ రోడ్డు ఆ త్రాష్టుడి బుద్ధిలాగా రొచ్చుగా వున్నది. ఆ రోడ్డుకు అటూ ఇటూ వున్న పూరి గుడిశెల కప్పుల్లోనుంచి లేస్తున్న పొగ భానుమూర్తి గుండెల్లో నుంచి ఎగతన్నుకొస్తున్న అసహ్యంలా వున్నది. బర్రెలు చుట్టూ గబ్బు కొడుతూ కుప్పలు కుప్పలుగా పడివున్న పేడ - తమ కొంప మీదకు మాణిక్యం విసిరిన అనర్థంలా వున్నది.

గుంటల్లో కాళ్ళు, ఆ పైన గుడ్డలమీద మట్టి మరకలు పడకుండా ఇద్దరూ జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.

అన్నీ పూరిగుడిశెల నడుమ మాణిక్యం రూపంలో పెరిగి వెల్లబోయని గోడలతో వున్న ఒకే ఒక పెంకు టిల్లు... చూరలోనుంచి పొడుచుకు వచ్చిన రాడ్‌కు - ఎండెక్కినా ఆరకుండా దాని కొడుకులా పెట్రేగి పోతున్న బలుబు.

ముందుగా మాధవరావు ఆయింటి ముందున్న మురుక్కాలువ మీద వేసిన నాపరాయి మీద కాలు పెట్టి దాటాడు. వెనగ్గా భానుమూర్తి ముక్కు మూసు కొని అనుసరించాడు.

పంచలోనే - నేను కదల్లేను, మెదల్లేను అన్న ట్లుగా - గోడకు జారిగిలబడి... సగం చెక్కిన తరువాత సరైన రూపంరాక వదిలేసిన నల్ల బండ రాయిలా బొమ్మలా - కూర్చొని ఉన్నది మాణిక్యం.

వీళ్ళను చూస్తూనే గుర్తించింది. ఆమె కళ్ళు పెద్దవయినయి. మొఖం విశాలమయింది. నోరంతా సాగదీసి, "అరేయ్ చంద్రూ! చాప తీసుకురా... మీ అన్నలొచ్చారు !" అన్నది ఆనం దంగా.

భానుమూర్తి అసహ్యంగా మొఖం పెట్టి ఆ త్రాష్టుడికి 'అన్న'లను చేసినందుకు ఆమె వంక చీద రింపుగా చూసాడు.


చంద్రం మొఖం చిట్లించుకుంటూ బయటకు వచ్చాడు వీళ్ళెందుకొచ్చారో తెలుసులే అన్నట్లుగా. మాధవరావుకు అతడిని చూడగానే తన చిన్నవాడు తండ్రిని చూచినంత ఉద్వేగం కలిగింది కొద్దిక్షణాలు.

"నీ పెళ్ళాన్ని కాఫీ కలపమను... బావగార్లు వచ్చా రని చెప్పు !"

అతడు లోపలికి వెళ్ళిపోయాడు విసురుగా.

"వద్దమ్మా ! ఇప్పుడే త్రాగి బయల్దేరాం ఇంటి దగ్గరనుంచి ! " అంటూ చాప మీద కూర్చున్నాడు మాధవరావు. "ఎలా ఉన్నది నీ ఆరోగ్యం ?"

"ఇలా వున్నాను చావలేక బ్రతకలేక... పైనుంచి




మీ నాన్న ఎప్పుడు రమ్మనమంటాడా అని ఎదురు చూస్తున్నాను."

భానుమూర్తికి దాని మాటలు వింటుంటే - అన్నయ్య తప్పు దారిలో వెళ్ళి దాని చేతిలో చిక్కుకు పోతున్నాడా అనిపిస్తోంది.

"చూడమ్మా ! మా పరిస్థితి నీకు తెలియందే మున్నది... నా కొక ఆడపిల్ల... వాడికి ఇద్దరు ఆడ పిల్లలు... నాన్న మిగిల్చి యిచ్చింది ఆ రెండకరాల మామిడి తోట మాత్రమే... దాంట్లో భాగం కావాలంటా చంద్రం రావడం బాగున్నదా ?... నువ్వే ఆలోచించు !"

ఆమె మాధవరావు వంక విచిత్రంగా చూసింది. ఆమెకు నోట మాట పెగల్లేదు ఓ నిముషం పాటు. " ఏమంటున్నావయ్యా నువ్వు ! " అని మాత్రం అన్నది.

"చంద్రం తమ్ముడి దగ్గరకు వచ్చి గోల చేశాడట - మామిడి చెక్కలు ఒక వంతు నాకివ్వాల్సిందేనని!"

చంద్రం లోపలనుండి విసురుగా వచ్చాడు "ఏం... నేనలా అడగటంలో తప్పేమైనా ఉన్నదా ?" అన్నాడు అరుస్తున్నట్లుగా.

మాణిక్యం తలతిప్పి కొడుకువంక చూపించి "ఎప్పుడు వెళ్ళావురా నువ్వు... నాకు చెప్పనే లేదు !" అన్నది నీరసంగా.

"నువ్వుండవే నోరుమూసుకొని ! నేను మాత్రం వాళ్ళలాగా ఆయనకు పుట్టలేదా ?... వాళ్ళేనా కొడుకులు... నాకు మాత్రం హక్కు లేదా ? ఇద్దరికిద్దరు ఉద్యోగాలు చేస్తూ బాగానే సంపాదిస్తున్నారు కదా... నాకే ఏమీ లేదు... ఆ ముక్క వుంటే కాస్త వెసలుబటగా వుంటుందని !"

"అదికాదురా చంద్రి! వాళ్ళది మన కెందుకురా... నీకిచ్చేదేదో నీకిచ్చాడు గదా... ఆయన ఇవ్వకపోతే నువ్విట్లా చలవ చేసిన దుస్తులు వేసుకు తిరిగేవాడివిట్రా !" అన్నది బాధగా మాణిక్యం.

"నీకు తెలీదు... నిన్ను నోర్మూసుకు పడి వుండమని చెప్పా! నాకు దాంట్లో భాగం కావిల్సిందే... నన్ను వాళ్ళలాగానే సుఖంగా బ్రతకనీయ్... అడ్డం వచ్చావో వూరుకునేది లేదు !" లేచి లోపలికి వెళ్ళబోయాడు.

మాణిక్యం కళ్ళు కొడుకు మాటలకు ఎర్ర బడ్డాయి. కోపంలోనుంచే ఆయాసం మొదలయింది. "ఆగు!" ఒక్క అరుపు అరిచింది... ఆ కేక ఒకప్పుడు వీధి వీధంతటినీ ఊపిన కంఠాన్ని గుర్తుకుతెచ్చేలా ఉన్నది.

"ఏంటే ?" విసురుగా తలెగరేశాడు చంద్రం.

"కోటయ్యన్నను పిలువు... చలమయ్యను, సుందరయ్యను గూడా పిలుచుకురా !"

"వాళ్ళెందుకు" నీరసంగా చూసాడు తల్లివంక.

"పెద్దవాళ్ళు గదా... ఏమంటారో విందాం !" ఆ మాట అని కళ్ళు మూసుకొన్నది. ఏదో గొణుక్కుంటున్నట్లుగా ఆమె లావు పెదాలు పైకి క్రిందకు కదులుతున్నాయి.

పదినిముషాల్లోనే ఆ పెద్ద మనుష్యులనబడే ముగ్గురూ మాణిక్యం ముందు వచ్చి కూర్చున్నారు.

మాణిక్యం వాళ్ళ రాకతో కళ్ళు తెరచి, తలెత్తి కొడుకు వంక చూస్తూ "భోషాణంలో కుడిపక్కగా క్రిందకు జాజి చెక్క పెట్టెవున్నది - పట్టుకురారా చంద్రీ !" అన్నది ఆయాసపడుతూనే.

చంద్రం తల్లి వంక తినేస్తున్నట్లుగా చూస్తూ చరచరా లోపలకు వెళ్ళాడు.

భానుమూర్తి గుండె గుభేలుమన్నది - 'ఆ ముసలాడు తోట మొత్తం ఈ ముండకే రాసిచ్చిన కాగితాల్లేవుగదా దాంట్లో !' అనుకున్నాడు.

చంద్రం రెండు నిముషాలల్లోనే ఆ పెట్టె తెచ్చి మాణిక్యం ముందు పెట్టాడు. మాణిక్యం చీరె అంచుకు ముడి వేసి వున్న తాళం చెవుల గుత్తి తీసి వచ్చిన ముగ్గురిలో పెద్దాయనకిస్తూ " కోటయ్యన్నా! దీన్ని తెరువు !" అన్నది.

ఆయన లేచి తాళం చెవుల గుత్తి అందుకున్నాడు.

"మీ ముగ్గురికీ వీళ్ళెవరో తెలుసుగదా ! నా సంగతి తెలుసు... నా దేవుడికి పుట్టిన బిడ్డే చంద్రిగాడు గూడా... ఆయన గారికే మరో అమ్మకు పుట్టిన బిడ్డలే వాళ్ళిద్దరూ... ముగ్గురూ ఒక అయ్యకు పుట్టిన వాళ్ళే... స్వంత అన్నదమ్ములే !"

భానుమూర్తికి దాని నాటకం అర్థమయి పోయినది. ఇక ముందు వాళ్ళను ఎలా ఎదుర్కోవాలో అన్నట్లుగా అసహనంగా అటూ ఇటూ కదిలాడు. ' అది వేస్తున్న ముడి పీటముడే... ఇక దాన్ని ఎవ్వరూ విడదీయలేరు ! ' అనుకున్నాడు చికాగ్గా.

"కనుక పెద్ద వాళ్ళుగా మీరే చెప్పండి తీర్పు... తన అన్నలిద్దరి స్వాధీనంలో వున్న మామిడి తోటలో భాగం కావాలంటున్నాడుట చెంద్రి !... ఆ పెట్టె మూత తీయి కోటయ్యన్నా!" అన్నది ఆమె మాటలు వింటున్న అతడ్ని చూస్తూ.

- ఆమెకు ఆ మాటలతో ఆయాస మెక్కువయినట్లుగా ఛాతి ఎగిరెగిరి పడుతుంది !

అతడు ఆ గుత్తిలోని ఆ పెట్టెలోని తాళంచెవి వెతికి పెట్టె మూత తెరిచాడు. ఆ పెట్టెలో ఏమున్నాయ్యోనన్నట్లుగా ఆత్రంగా ముగ్గురు అన్నదమ్ములూ ఒకేసారి ముందుకు వంగారు.

- దాన్నిండా బంగారు ఆభరణాలున్నాయి !

మూత తెరుస్తూనే దాన్ని ఆమె ముందుకు నెట్టాడు కోటయ్య.

చూసిన ఒక్క క్షణంలోనే గుర్తించాడు వాటిని మాధవరావు !

"ఇవన్నీ నా దేవుడు మెళ్ళో తాళి గట్టిన ఆడదానివి... నేను వద్దయ్యా, అది నాకు శుభం కాదయ్యా - అన్నా వినకుండా ఇంటినుంచి తెచ్చి నావంటికి తగిలించాడు... నేను ఇప్పటికి చేస్తున్నదే తప్పు... ఇంకా నన్ను పాప కూపంలోకి నెట్టబోకయ్యా అని బ్రతిమలాడినా వింటేనా ఆ మహారాజు... !" ఆమె నోటమ్మట మాటలు పెగలకపోవటంతో - వాటిని గుండెల్లో కూర్చుకుంటున్నట్లుగా కాసేపు ఆగింది.

"కోటయ్యన్నా !... చెలమయ్యబాబూ... సుందరయ్యా... ఇప్పుడు మీరు చెప్పండి... నా కొడుకు మామిడితోటలో భాగం కావాలంటున్నప్పుడు - ఆ దేవుడిచ్చిన సొమ్ములోనూ వాడి అన్నలకు భాగం ఇవ్వవద్దా ?... అసలు ఆ సొమ్ము నాది కానే కాదే... ఆయిద్దరు పిల్లల అమ్మది... కనుక నాదేవుడు బ్రతికుండగా సంపాదించిన ఆస్తులు ఎవరికి ఎంత చెందాల్సిందీ మీరే నిర్ణయించండి !" ఆమె ఆవేశం తగ్గిన దానిలా తలవాల్చి ప్రశాంతంగా కళ్ళు మూసుకున్నది - వాళ్ళు న్యాయం ఏ చెబుతారో తనకు తెలుసులే అన్నట్లుగా. ❋